

క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ

క్రిస్టియన్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● మంత్రి కొండా సురేఖ

బర్కత్‌పుర, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుందని, వారిని అన్ని విధాలుగా ఆదుకోవడానికి కట్టుబడి ఉందన్నారు. బుధవారం తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్‌ను మంత్రి తన చాంబర్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. క్రిస్టియన్‌లు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ జిలుకర రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ప్రతీ ఒక్కరికీ 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని, ఇంటి నిర్మాణానికి రూ. 12 లక్షలు ఆర్థిక సహాయం చేయాలని, రాష్ట్ర సాధనలో పాల్గొన్న ఉద్యమకారుడికి ప్రతినెలా రూ. 10 వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. ఈ నెల 26న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జేఏసీ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు డాక్టర్ బి. విద్యాకుమార్, బొట్టుమంచి సుధాకర్, సోమయ్య, గోలి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రేషం మల్లేష్ తదితరులు

మేదర ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): మేదరుల సంక్షేమం కోసం రూ. 1000 కోట్లతో మేదర ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కులస్థులకు సబ్సిడీపై వెదురు సరఫరా చేయాలని జంటనగరాల మహేంద్ర సంఘం అధ్యక్షుడు రేషం మల్లేష్ డిమాండ్ చేశారు. బుధవారం బాపూనగర్‌లోని జంటనగరాల మహేంద్ర సంఘం కార్యాలయంలో ప్రపంచ వెదురు దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. వెదురు పెంచేందుకు ప్రతి కుటుంబానికి ఐదెకరాలు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఉప్పల్ భగాయత్‌లో కేటాయించిన స్థలంలో మేదర ఆత్మగౌరవ భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో సంఘం ప్రధానకార్యదర్శి పిల్లి గురుమూర్తి, కోశాధికారి కైలాష్‌కుమార్, ఉపాధ్యక్షులు పిల్లి రాంకుమార్, ప్రచార కార్యదర్శి కె. నర్సింగరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పాతకోటి సూర్యప్రకాష్, సంయుక్త కార్యదర్శి పి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోనాల అదనపు నిధుల చెక్కు అందజేత

చిక్కడపల్లి, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ ఉప్పలమ్మదేవాలయంలో బోనాల వేడుక సందర్భంగా అదనపు నిధులు రూ. 13,500 మంజూరయ్యాయి. దేవాదాయ శాఖ ద్వారా మంజూరైన అదనపు నిధుల చెక్కును ఆలయ నిర్వాహకుడు గుండు జగదీశ్‌బాబుకు ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బండారినవీన్ కుమార్, బాబ్జీ, మారిశెట్టి నర్సింగ్‌రావు, బాబురావు, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




సాంకేతిక విద్యాశిక్షణ మండలి కార్యదర్శి పుల్లయ్యకు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

వైర్‌మెన్ సూపర్‌వైజర్ దరఖాస్తుల గడువు పొడిగించాలి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): వైర్‌మెన్ సూపర్‌వైజర్ దరఖాస్తుల గడువు పొడిగించాలని తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ నేతలు కోరారు. సాంకేతిక విద్యా శిక్షణ మండలి కార్యదర్శి ఎ. పుల్లయ్యను, ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు కార్యదర్శి టి. కాంతారావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ బోర్డు సభ్యుడు నేమాల బెనర్జీ మాట్లాడుతూ.. ఇటీవల సెలవులు ఎక్కువగా రావడం, పరీక్ష వివరాలు ఆన్‌లైన్‌లో పెట్టినా అభ్యర్థులకు తెలియలేదన్నారు. తమ వినతిపై స్పందించిన కార్యదర్శి దరఖాస్తుల గడువు తేదీ పొడిగింపుపై సానుకూలంగా స్పందించారని తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులకు వారంపాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోషియేషన్ ప్రతినిధులు కందుకూరి మహేష్, వినోద్‌రావు, సత్యనారాయణ, రాంరెడ్డి, నరేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు టీపీసీసీ అధ్యక్షుడికి సన్మానం



మాట్లాడుతున్న బాల్‌రాజ్‌గౌడ్

రాంనగర్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను మాజీ ఎంపీ వి. హనుమంతరావు ఆధ్వర్యంలో ఈనెల 19న రవీంద్రభారతిలో సత్కరిస్తున్నామని తెలంగాణ గౌడ, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్ తెలిపారు. బుధవారం చిక్కడపల్లిలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్ష పదవి గౌడ కులస్థులకు దక్కిన గౌరవం అని అన్నారు. సన్మాన కార్యక్రమానికి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో గౌడ, కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎ. విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల విజయవంతంపై హర్షం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాలు విజయవంతం కావడం హర్షణీయమని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మద్దూరి శివాజీ, ఆనంద్‌రావు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం సత్యనారాయణస్వామి వ్రతాలు, పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన లడ్డూను బుధవారం సాయంత్రం వేలం వేశారు. కార్తీక్ రూ. 1.31 లక్షలకు పాడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో లక్ష్మారెడ్డి, మాజీ చైర్మన్ బీఎన్ శ్రీనివాస్‌యాదవ్, అర్చకులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసం రాహుల్‌పై విమర్శలు చేయొద్దు

కవాడిగూడ, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీకి కేంద్ర రైల్వేసహాయ శాఖమంత్రి రవనీత్ సింగ్ బిట్టు, బీజేపీ నేతలు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని యువజన కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు సంఘపాక వెంకట్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రంలో బీజేపీ నేతలను తిరగనీయకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. రాహుల్‌గాంధీపై కేంద్ర రైల్వే సహాయ శాఖమంత్రి, బీజేపీ నేతలు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం ఇందిరాపార్కు చౌరస్తాలో రవనీత్‌సింగ్ బిట్టు, ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి, బీజేపీ నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంకట్ మాట్లాడుతూ.. దేశంలో రాహుల్ గాంధీకి రోజు రోజుకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి బీజేపీ నేతలు జీర్ణించుకోలేక అవాకులు, చవాకులు పేలుతున్నారని అన్నారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన గాంధీ కుటుంబంపై బీజేపీ నేతలు ఇష్టంవచ్చినట్లు విమర్శలు చేస్తే కాంగ్రెస్ శ్రేణులు ఊరుకోరని హెచ్చరించారు. రాజకీయ లబ్ధి కోసం విమర్శలు చేయవద్దన్నారు. బీజేపీ నేతలు రాహుల్ గాంధీకి బహిరంగ క్షమాపణ చెప్పకపోతే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్, కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు పాశం అనిల్‌కుమార్‌యాదవ్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెనడీ, నాయకులు మేడి సురేష్, దేవీవరప్రసాద్, జాఫర్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు తదితరులు

కాంగ్రెస్ నాయకుల నిరసన

ముషీరాబాద్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి దేశవ్యాప్తంగా వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీజేపీ, శివసేన నేతలు విమర్శలు చేస్తున్నారని ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్



బీజేపీ కార్యాలయ ముట్టడి కార్యక్రమంలో జ్ఞానేశ్వరి రవిప్రసాద్ తదితరులు



ఇందిరాపార్కు చౌరస్తాలో ప్రధాని, కేంద్రమంత్రి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు అన్నారు. రాహుల్‌గాంధీపై బీజేపీ, శివసేన నేతల అనుచిత వాఖ్యలు చేసినందుకు ముషీరాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిజ్జి శత్రు మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ పేదలు, దళితులు, మహిళల సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిరంతరం ప్రశ్నిస్తుండడంతో బీజేపీ నేతలు ఓర్వలేకపోతున్నారని ధ్వజమెత్తారు. బీజేపీ, శివసేన నేతలు విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తూ రాజకీయ పబ్బం గడుపుతున్నారన్నారు. రాహుల్‌గాంధీకి మరింత రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రాము, శ్రీకాంత్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీపై కేంద్ర మంత్రి విమర్శలు చేయడాన్ని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వరి రవిప్రసాద్ ఖండించారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు ఆధ్వర్యంలో జరిగిన బీజేపీ కార్యాలయ ముట్టడి కార్యక్రమంలో ఆమెతోపాటు నాయకురాళ్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వరి మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి, బీజేపీ నాయకులు రాహుల్ గాంధీకి క్షమాపణ చెప్పకపోతే వారిని రోడ్లపై తిరగనీయబోమని హెచ్చరించారు. పోలీసులు వారిని అరెస్ట్ చేసి బేగంపేట పీఎస్‌కు తరలించారు.

గ్రామ పంచాయతీల సిబ్బందికి ప్రతినెలా జీతాలు అందుతున్నాయి

రాంనగర్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా పాలనలో గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కారోబార్‌లు, సిబ్బందికి ప్రతినెలా వేతనాలు ఇస్తున్నారని గ్రామ పంచాయతీ కారోబార్, సిబ్బంది సంఘం ఉపాధ్యక్షుడు వంగ రవీందర్ తెలిపారు. రాష్ట్ర గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాల కోసం బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో గ్రామ పంచాయతీ సిబ్బందికి జీతాలు పెంచాలని సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న జీతాల చెల్లింపునకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ప్రత్యేక నిధుల కింద రూ. 150 కోట్లు కేటాయించారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హరీ‌ష్‌రావును చాలాసార్లు కలిసి జీతాల కోసం మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, ఇప్పుడు ఆయన తమ జీతాల కోసం మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన మోసపూరిత మాటలను మానుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో వంగ రవీందర్ తదితరులు

అక్కినేని ఆత్మీయ పురస్కారాల ప్రదానం

రవీంద్రభారతి, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ చరిత్రలో చెరగని ముద్రవేసుకున్న గొప్ప నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని ప్రముఖ సినీదర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో బుధవారం అలైడ్ ఆర్టిస్ట్స్ ఆడిటోరియంలో దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుగ్రహీత డా.అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్.రామకృష్ణ, డా.అమలాపురం కన్నారావుకు అక్కినేని ఆత్మీయ పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రేలంగి నరసింహారావు పురస్కారగ్రహీతలను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అక్కినేని శతజయంతి వేడుకల సందర్భంగా పురస్కారాలు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు.

సభాధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ.. తెలుగు సినిమా రంగంలో చక్కటి నటనతోపాటు నిజ జీవితంలో ఆదర్శవంతమైన జీవితాన్ని అక్కినేని గడిపారని అన్నారు. కార్యక్రమంలో బి.రాజగోపాలరావు, బి.జె.ఆనంద్‌కుమార్, రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.



పురస్కారగ్రహీతలను సత్కరిస్తున్న అతిథులు

సాహిత్యం సామాజిక ప్రయోజనాన్ని సాధించేదిగా ఉండాలి

అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం ఆనందం కలిగించడంతోపాటు సామాజిక ప్రయోజనాన్ని సాధించేదిగా ఉండాలని ప్రముఖ రచయిత్రి, విమర్శకురాలు డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మీదేవి అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో సాగుతున్న పరిణత వాణి ప్రసంగ పరంపరలో ఆమె బుధవారం తమ జీవితం, సాహిత్యంపై ప్రసంగించారు. అసమానతలు ఉన్న సమాజాన్ని సంస్కరించడం కూడా సాహిత్య ప్రయోజనాల్లో ఒకటని ఆమె తెలిపారు. మంచి రచయితలుగా ఎదగడానికి సాహిత్య అధ్యయనం చాలా ముఖ్యమని, ఇప్పటి రచయితలు అధ్యయనానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంలేదని అన్నారు. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ.. పరిణతవాణి ప్రసంగాలను పుస్తక రూపంలో అందిస్తున్నామని, ఇవి చదివినవారికి ఎంతో స్ఫూర్తిని కలిగిస్తాయని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపన్యాసం చేశారు. పరిషత్తు ప్రాచ్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎ.సిల్మా నాయక్ సమావేశకర్తగా వ్యవహరించారు.



మాట్లాడుతున్న డాక్టర్ వాడ్రేవు వీర లక్ష్మీదేవి

మెడికల్, డెంటల్ కాలేజీలకు ఇచ్చిన

డీమ్డ్ యూనివర్సిటీ హోదాను రద్దు చేయండి

తార్నాక, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీనవర్గాల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే విధంగా మెడికల్, డెంటల్ కాలేజీలకు ఇచ్చిన డీమ్డ్ యూనివర్సిటీ హోదాను రద్దు చేయాలని బీసీ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ బుధవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రం అందజేశారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న బి. స్వామిగౌడ్ తదితరులు

ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ.. మెడికల్, డెంటల్ కాలేజీలకు కేంద్ర ప్రభుత్వం డీమ్డ్ యూనివర్సిటీ హోదాను ఇవ్వడం వల్ల కళాశాలల యాజామాన్యాలు రిజర్వేషన్లు అమలు చేయకుండా ఇష్టారాజ్యంగా సీట్లను అమ్ముకుంటున్నాయన్నారు. దాంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. మెడికల్, డెంటల్ కాలేజీలకు డీమ్డ్ వర్సిటీ హోదాను రద్దు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహను కోరామన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని

ముగ్గురికి గాయాలు

కొత్తపేట, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): కారు రెండు బైక్‌లను ఢీకొట్టడంతో ముగ్గురు గాయపడ్డారు. ఎల్బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం శారదానగర్‌కు చెందిన యెమినేని గోపీ(32), తన తండ్రి వెంకటేశ్వర్‌రావు(60) బుధవారం బైక్‌పై సహారా టౌన్‌షిప్ మీదుగా మన్సూరాబాద్ వెళ్తున్నారు.

మన్సూరాబాద్ చౌరస్తాలో ఎదురుగా వేగంగా వస్తున్న కారు వారి బైక్‌ను, మరో బైక్‌పై వెళ్తున్న వనస్థలిపురం అరుణోదయనగర్‌కు చెందిన ఎస్. కృష్ణారెడ్డి(49)ని ఢీకొట్టింది. ముగ్గురి కాళ్లకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని ప్రాగ్మా ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ నరేందర్(32)ను అదుపులోకి తీసుకున్నారు. గోపి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జైపూర్-కర్నూల్ ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీ

బర్కత్‌పుర, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణికురాలి బంగారు నగలను దొంగలు చోరీ చేశారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బేగంబజార్‌లో నివసిస్తున్న మమత జైపూర్ - కర్నూలు ఎక్స్‌ప్రెస్ రైలులో నగరానికి వస్తోంది. మహారాష్ట్ర ధర్మాబాద్ వద్ద కిటికీ పక్కన నిద్రిస్తుండగా ఆమె మెడలోని 35 గ్రాముల బంగారం మంగళసూత్రాన్ని దొంగలు లాక్కొని పారిపోయారు. బాధితురాలు బుధవారం కాచిగూడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు నిమిత్తం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

బ్యాక్ డోర్ ఉద్యోగాల పేరుతో మోసం

● రూ. 3.66 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): బ్యాక్ డోర్ ఐటీ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగిని మోసం చేసిన సైబర్ నేరగాళ్లు నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ జారీ చేసి రూ. 3.66 లక్షలు కాజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 29 ఏళ్ల నిరుద్యోగికి ఓ గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఒక కంపెనీకి చెందిన వ్యక్తుల్లా ఇద్దరు మాట్లాడారు. మీకు ఎంఎన్‌సీ కంపెనీలో బ్యాక్‌డోర్ ద్వారా మంచి ఉద్యోగం ఉందని చెప్పి అందుకు సంబంధించిన ఇంటర్వ్యూను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని చెప్పారు. దీంతో బాధితుడు దశలవారీగా రూ. 47 వేలు వారు చెప్పిన ఖాతాలో జమచేశాడు.

అనంతరం జాబ్ ఆఫర్ లెటర్‌ను పంపించారు. రూ. 3.19 లక్షలు చెల్లించిన తర్వాతే ఉద్యోగంలో చేరాలని సూచించారు. ఉద్యోగం వచ్చిందన్న సంతోషంతో బాధితుడు డబ్బును వారు చెప్పిన ఖాతాలో జమచేశాడు. డబ్బులు చేతికి అందిన వెంటనే ముందుగా పంపిన జాబ్ ఆఫర్ లెటర్‌ను రద్దు చేసిన కేటుగాళ్లు దాని స్థానంలో నకిలీ అపాయింట్‌మెంట్ లేఖను పంపించారు. బాధితుడు ఫోన్ చేయగా స్పందించ లేదు. మోసపోయానని గ్రహించిన అతడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీ కొట్టిన కారు

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు జాతీయ రహదారి బుద్వేల్ రైల్వేస్టేషన్ వద్ద బుధవారం ఆగి ఉన్న లారీని వెనకాల నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఆరాంఘర్ నుంచి శంషాబాద్ మార్గంలో వెళ్తున్న కారు(టీఎస్08 జేఆర్ 2556) బుద్వేల్ రైల్వేస్టేషన్ వద్దకు రాగానే ముందుగా ఆగి ఉన్న లారీ (కేఏ52-0409)ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. కారు డ్రైవర్‌కు తీవ్రమైన గాయాలయ్యాయి.



లారీని ఢీకొట్టిన కారు

అత్యాచార యత్నం కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

మల్కాజిగిరి, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో వావి వరుసలు మరిచి కన్న కుమార్తెపైనే అత్యాచారానికి యత్నించిన కేసులో ఓ తండ్రికి మల్కాజిగిరి ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 5 వేల జరిమానా విధించారు. మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి 2019 ఏప్రిల్ 11న తాగి ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో భార్య ఇంట్లో లేదు. తాగిన మైకంలో పదో తరగతి చదువుతున్న తన కుమార్తెపై అత్యాచారం చేయబోయాడు. బాలిక తప్పించుకొని బయటకు పరుగుతీసి తల్లి పనిచేస్తున్న ఇంటికి వెళ్లి ఆమెకు విషయం చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కేసు దర్యాప్తు ప్రారంభించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. బుధవారం కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడికి ఏడేళ్ల కారాగార శిక్ష, రూ. 5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

ఉప్పల్, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సంజిమా ఏడాది నుంచి నాచారంలో హాస్టల్‌లో ఉంటూ నర్సింగ్ కోర్సు చేస్తోంది. బుధవారం సాయంత్రం హాస్టల్ రూమ్‌లో ఉరేసుకుంది. గమనించిన హాస్టల్ నిర్వాహకులు నాచారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంజీమా ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టపాసులు నిల్వ ఉంచిన ఇంట్లో పేలుడు

● పైకప్పు ధ్వంసం.. ఇద్దరికి తీవ్రమైనగాయాలు

మదీన, సెప్టెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో అక్రమంగా తయారు చేస్తున్న టపాసులు పేలి ఇద్దరికి తీవ్రమైనగాయాలు కాగా, మరో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. టపాసులు నిల్వ ఉంచిన ఇంటి పైకప్పు రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ సంఘటన బహదూర్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం జరిగింది. ఒక్కసారిగా భారీ పేలుళ్ల శబ్దం రావడంతో చుట్టుపక్కల వారు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కిషన్‌బాగ్ కాశీబుగ్గ ఆలయం సమీపంలో మహ్మద్ వసీం(29) కుటుంబం నివసిస్తోంది. ఆరునెలల క్రితం ఈ ఇంటిని కొనుగోలు చేసి టపాసులు తయారు చేస్తున్నట్లు తెలిసింది. త్వరలో దీపావళి పండగ రానుండడంతో టపాసులు తయారు చేసి నిల్వ ఉంచారు. బుధవారం సాయంత్రం 5 గంటల సమయంలో టపాసులు పేలి భారీ శబ్దం వచ్చింది. పేలుడుకు ఇంటి పైకప్పు రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. శబ్దానికి పక్కింటి కిటికీ అద్దాలు కూడా ధ్వంసమయ్యాయి. పేలుడు జరిగినప్పుడు ఇంట్లో ఉన్న మహ్మద్ వసీం తల్లి షాకీరాబేగం(55), చెల్లి సమీనాబేగం(27)కు మంటలంటుకుని తీవ్రంగా గాయపడ్డారు. మహ్మద్ వసీంతోపాటు తండ్రి హఫీజ్, సమీనాబేగం పిల్లలిద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న బహదూర్‌పురా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తీవ్రంగా గాయపడిన షాకీరాబేగం, సమీనాబేగం చికిత్స పొందుతున్నారు. జనావాసాల మధ్య అనుమతి లేకుండా టపాసులు తయారు చేస్తుండడంపై స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ధ్వంసమైన పై కప్పు రేకులు



చెల్లాచెదురుగా ఇంట్లోని సామాన్లు